# నీకు తెలియని నిజం

ఉదయం పది గంటలకు చలపతి ఆఫీసు కొచ్చేసరికి అతని టేబిల్ మీద ఒక ఉత్తరం పడి ఉంది. చలపతి తన సీట్లో కూర్చుని, ఆ ఉత్తరం చింపి చదివాడు. దాన్లో నాలుగే వాక్యాలున్నాయి.

"చలపతీ !

ప్రస్తుతం నా కొక పెద్ద సమస్య వచ్చింది. ఈ చిక్కునుండి నువ్వు తప్ప నన్నెవరూ రక్షించలేరు! అందుకే ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. వెంటనే బయలుదేరి రా.

నీ రాజారావు.'

రాజారావు చలపతి స్నేహితుడు. ఇద్దరూ కలిసి బి. కామ్. వరకూ చదివారు. ఆ తర్వాత రాజారావు ఎమ్. కామ్. చదవడానికి వాల్తేరు వెళ్ళాడు. చలపతికి ఉద్యోగం రావడంతో చదువు ఆపేశాడు. రాజారావు ఎమ్. కామ్. పాసయ్యాక చాలాకాలం నిరుద్యోగిగా ఉండి ఈ మధ్యనే ఒక చిన్న కంపెనీలో చేరాడు.

రాజారావు జీవితాన్ని చాలా తేలిగ్గా తీసుకుంటాడు. ఏ విషయాన్ని గూర్చి తీవ్రంగా ఆలోచించడు. మరయితే ఇప్పుడతనికి వచ్చిన సమస్య ఏమిటో? తెలుసుకోవాలనే కుతూహలం కలిగింది చలపతికి.

చలపతి మర్నాడు ఉదయం వాల్తేరు మెయిలెక్కాడు. ఒంటి గంటకు మెయిలు వాల్తేరు చేరింది. ఆటో డాబా గార్డెన్స్‌లో ఉన్న రాజారావు రూముకు వెళ్ళాడు చలపతి. కానీ రూముకు తాళంవేసి ఉంది. తిరిగి వచ్చి ఇంటివాళ్ళను అడిగాడు.

"రాజారావు పది రోజుల నుండీ ఇక్కడకు రావడం లేదండీ! వాళ్ళ స్నేహితుడి కెవరికో జబ్బుగా ఉందిట. మహారాణి పేటలో ఉంటున్నాడు. మీ రొస్తే ఈ అడ్రసుకు రమ్మన్నాడు". ఇంటాయన చిన్న కాగితం ఇచ్చాడు.

చలపతి ఆ అడ్రసు ప్రకారం ఆటోలో బయలుదేరి చివరకు బీచ్ రోడ్డులో ఉన్న రెండంతస్తుల మేడ ముందు నిలిచాడు.

మరోసారి అడ్రసు చూసుకుని ఆటో డ్రైవర్‌కి డబ్బులిచ్చి పంపేశాడు.

రాజారావుకి ఇంత గొప్ప స్నేహితుడున్నాడా!'అనుకుంటూ లోపలికెళ్ళే ధైర్యంలేక గేటుముందే నిలబడ్డాడు చలపతి.

రాజారావు మేడపై నుండి చలపతిని చూసి గబగబా క్రిందికి దిగి వచ్చాడు. చలపతి చేతిలోని సూట్‌కేస్ అందుకుంటూ-చలపతీ"! వచ్చావా!" అన్నాడు.

ఆ మాటలో ఎంతో ఆనందం, ఇక నాకేం భయంలేదన్న తృప్తీ కనబడ్డాయి. చలపతికి.

ఇద్దరూ లోపలి కెళ్ళారు! చలపతి ఆ ఇంటిఐశ్వర్యాన్ని చూసి ఆశ్చర్యపడసాగాడు.

రాజారావు మేడమీదికి తీసుకెళ్ళాడు.

"చలపతి ! చాలా దూరం ప్రయాణించేసి అలసిపోయావ్ ! ఇది నీ రూమ్ ! అటాచ్డ్ బాత్ ఉంది ! ముందు స్నానం, భోజనం కానిచ్చి విశ్రాంతి తీసుకో.

తర్వాత తీరిగ్గా మాట్లాడుకుందాం" అన్నాడు రాజారావు.

చలపతికీ అలసటగా ఉంది. రాజారావు మాటలకు 'సరే' అన్నట్లు తలూపాడు.

"చలపతీ ! సాయంత్రం నేను వచ్చి హాస్పిటల్‌కు తీసుకెళతాను నిన్ను ! అప్పటివరకూ రెస్టు తీసుకో!" అన్నాడు రాజారావు మళ్ళా. దానికి తలూపాడు చలపతి.

చలపతికి గది చూపించి రాజారావు వెళ్ళిపోయాడు, అర్జంటు పని ఉందంటూ.

'ఏమిటో వీడి అర్జంటుపని' అనుకుంటూ చలపతి మంచం మీద కూలబడ్డాడు!

* * *

సరిగ్గా నాలుగు గంటలకు ఇద్దరూ బయలుదేరి హాస్పిటల్‌కి కారులో వెళ్ళారు. పై అంతస్తులోని స్పెషల్ రూమ్‌లో తెల్లటి దుప్పటి పరచి ఉన్న బెడ్ మీద ఒక వ్యక్తి కళ్ళు మూసుకుని పడుకుని వున్నాడు. అతని ప్రక్కన కుర్చీలో ఒక యువతి అటు తిరిగి కూర్చుని ఉంది.

అడుగుల చప్పుడు విని ఆమె ఇటు తిరిగింది. చలపతిని చూడగానే ప్రశ్నార్థకంగా ఆమె కను బొమ్మలు ముడిపడ్డాయి.

"ఇతడే నా ఫ్రెండు చలపతి, ఈమె నీరజ ..." పరిచయం చేశాడు రాజారావు.

ఆమెని చూస్తున్న చలపతికి హఠాత్తుగా వారం రోజుల క్రితం ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో చూసిన చిత్రం జ్ఞాపకం వచ్చింది. ఆ చిత్రం పేరు 'అలసిన సౌందర్యం'. ఎగ్జిబిషన్‌లో ఆ చిత్రం చూసినప్పుడు దానిలో సౌందర్య చ్ఛాయ లెక్కడా కనబడలేదతనికి. కానీ ఇప్పుడు ఈమెది నిజంగా అలసిన సౌందర్యమే అనుకున్నాడు.

నిద్రలేమితో బరువుగా వాలిపోతున్న కళ్ళు. చెదిరి నుదుటి మీద పడుతున్న జుట్టు. నలిగి శరీరానికి అతుక్కుపోయిన గులాబీ రంగు వాయిల్‌చీర. కాగి ఎర్రబడ్డ మీగడ పాలల్లా, సాగి పచ్చపడ్డ బంగారంలా ఉన్న నీరజ సౌందర్యం చలపతిని ముగ్ధుణ్ణి చేసింది.

నాకు చిత్రలేఖనం వచ్చి ఉంటే ఎంత బాగుండేది ! ఈమె రూపాన్ని చిత్రించి ధన్యుడనయ్యేవాడినని అనుకున్నాడు చలపతి !

"చలపతీ ! నా ఫ్రెండ్ సారధి భార్య."

"అలాగా" అంటూ మంచం వేపు చూశాడు చలపతి.

"ఇతడే సారధి" అన్నాడు రాజారావు.

మెడ వరకు దుప్పటి కప్పి ఉంది. ముఖం బాగా ఉబ్బిపోయి మాగిన టొమాటోలా ఉంది. కళ్ళు మూసుకుని పడుకున్నాడు.

"ఇంతక్రితమే డాక్టరు వచ్చి 'ఇంజక్షనిచ్చి వెళ్ళారు ! ఆయన ఇప్పుడిప్పుడే లేవరు. నేను ఇంటివెడతాను" అంది నీరజ లేచి.

"సరే ! మేం కాస్సేపు ఇక్కడ ఉంటాం!" అన్నాడు రాజారావు.

నీరజ వెళ్ళిపోయింది.

"ఏమిటీ జబ్బు" "గుండెజబ్బు" ఉలిక్కిపడ్డాడు చలపతి. ముఫై ఏళ్ళయినా నిండని ఇతడికి గుండెజబ్బా! డబ్బున్న వాడిని తీయగా తిని తిరగనీడు ఆ దేవుడు!

"ప్రస్తుతానికి గండం నుండి బయటపడ్డట్లే ! బాగా రెస్టు కావాలిట. సారధిని ఇంకో వారంరోజుల్లో డిశ్చార్చ్ చేస్తారు. కానీ, చలపతీ, ఇది కనబడని రోగంరా!" విచారంగా అన్నాడు రాజారావు.

అవును జీవితంలో ఒక్కసారి ఈ రోగం వచ్చిందంటే ఇక మృత్యు దేవత యొక్క లయకాల విన్యాసానికి తెర ఎత్తినట్లే అనుకున్నాడు చలపతి.

ఇంతలో నర్సు వచ్చి సారధి పల్సు చూసింది "చలపతీ! నర్సు సారధి దగ్గర ఉంటుంది. మనం అలా బయటికి వెడదాం" అన్నాడు రాజారావు.

ఇద్దరూ ఆటోలో రామకృష్ణా బీచ్ దగ్గరకు వచ్చి అక్కడున్న సిమెంటు బెంచీ మీద కూర్చున్నారు.

కడలి కోపంతో ప్రియుడి మీద మండిపడుతున్న ప్రేయసిలా ఉంది. తన నుండి వేరుపడిపోయిన ఈ ప్రపంచాన్ని కబళించాలనే ఆవేశంతో తెరలి తెరలి కెరటమై ముంచుకు వస్తోన్నట్లుంది. కానీ చెలియలి కట్ట దాటలేక నిరాశతో, నిస్పృహతో వెనక్కి వెళ్ళిపోతోంది. కడలికి ఆవేశం ఎక్కువై ఆ గీత 'దాటి వచ్చి లోకాన్ని ముంచేస్తే...

"చలపతీ! నాకు చాలా భయంగా ఉందిరా?"

ఆలోచిస్తున్న చలపతి అతని మాటలకు ఉలిక్కిపడ్డాడు.

"ఏమిటి నువ్వనేదిది, రాజారావ్!" ఆశ్చర్యంగా అడిగాడు.

"నా కోసమస్య వచ్చింది. దానికి నీ సలహా కావాలి."

చలపతి కప్పుడు జ్ఞాపకం వచ్చింది రాజారావు వ్రాసిన ఉత్తరం గురించి.

"రాజా! సలహా సంగతి ఎలా ఉన్నా, నీ మనస్సేమిటో చెప్పు తప్పకుండా వింటాను" అన్నాడు.

అతని బాధేమిటో తెలుసుకోవాలని చలపతికి చాలా కుతూహలంగా ఉంది.

"నీరజ నన్ను ప్రేమిస్తోంది" అన్నాడు రాజారావు. సందర్భం లేకుండా హటాత్తుగా పాత్ర ప్రవేశం జరిగినట్లుంది చలపతికి. తెల్లబోయి చూశాడు.

"నిజం. చలపతీ ! ఆ విషయం తెలిసినప్పటినుండీ నా కిక్కడ నుండి వెళ్ళిపోవాలని ఉంది. కానీ, సారధిని వదలి వెళ్ళలేకుండా ఉన్నాను!" అన్నాడు రాజారావు.

చలపతి మాట్లాడలేదు.

అతని కళ్ళముందు నీరజ మెదిలింది. మంచుముసుగు తొలగించుకున్న ప్రకృతి కాంతలా నవ్వుతోంది.

చలపతి ఏదో అనబోయాడు.

ఇంతలో "మీ రిక్కడ ఉన్నారా?" అన్న మాటలు విన్పించి తల త్రిప్పి చూశారిద్దరూ. నీరజ......

నీరజ వస్తోంది... సంధ్యా కాంత నడిచి వస్తున్నట్లుగా ... పసుపు రంగుపై ఎర్ర పూలున్న బిన్నీ సిల్కు చీర, చేతికి ఎర్ర ప్లాస్టిక్ గాజులు, మరో చేతికి వాచీ, నుదుట మీద ఎర్రని బొట్టు.

అద్భుత రంగుల కలయికతో ఏర్పడిన అసాధారణ చిత్రంలా ఉంది నీరజ" అనుకున్నాడు చలపతి.

"నేను వచ్చి మిమ్మల్ని డిస్టర్బ్ చేశానేమో !' నవ్వింది నీరజ.

నవ్వుతూంటే బుగ్గలపై చిన్న నొక్కులు. ఎదురుగా ఉన్న సముద్ర కెరటాల్లోని నీలి ఆమె కురుల్లో మెరిసి, కళ్ళల్లోకి జారి, బుగ్గల నొక్కుల్లో మెలిక పడినట్లుంది.

"అబ్బే లేదు కూర్చోండి." చలపతి అన్నాడు.

ఆమె కూర్చుని రెండు చేతుల్ని మెడలవంపు క్రింద పెట్టుకుని నొక్కుకుంటూ—

"అబ్బ ! ఇక్కడెంత హాయిగా ఉందో? ఈ హోరూ, ఈ సందడీ – మనస్సుకు

ఎంతో ధైర్యాన్నిస్తున్నాయి. రోజూ కాస్సేపన్నా ఇక్కడ కొచ్చి కూర్చోకపోతే నేను మనిషిని కాలేను బాబూ!'' అంది.

''నీరజా ! సారధి కెలా ఉందన్నాడు డాక్టరు?'' రాజారావు అడిగాడు.

నీరజ విసుగ్గా చూసింది.

''రాజారావ్! ఇంత చక్కని వాతావరణంలో కూడా రోగులు, మందులేనా! ఇంకేవన్నా మాట్లాడుదూ'' అంది.

దెబ్బతిన్నట్లు చూశాడు రాజారావు.

చలపతి ఆమె మాటల్ని బట్టి ఆమె మనస్తత్వాన్ని అంచనా వెయ్యడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఆమె చలపతి వేపు తిరిగి ! ''చలపతిగారూ! మీ గురించి రాజారావు చెప్పాడు. మీరు పుస్తకాలపై సమీక్షలు వ్రాసి పత్రికలకు పంపిస్తుంటారట కదా?'' అనడిగింది.

తను వ్రాసేది కేవలం సమీక్షలు కాదు, విమర్శలు. తన విమర్శలు సూటిగా, తీక్షణంగా ఉంటాయి. తను సారస్వత విమర్శలు చేస్తున్నాడు. కానీ, జీవిత విమర్శలే చెయ్యలేకుండా ఉన్నాడు. అనుకున్నాడు చలపతి తనలో తను నవ్వుకుంటూ

''చలపతిగారూ! మీరు కూడా ఎక్కువగా మాట్లాడరా ఏమిటి? నేనూ, రాజారావు ఉంటే అతడే ఎప్పుడూ శ్రోత'' అంది.

చలపతి నవ్వేస్తూ ''లేదండీ! నేను లెక్చరర్ని కాకపోయినా మాట్లాడడం మొదలెడితే ఎదుటి వ్యక్తికి విసుగు పుట్టాల్సిందే'' అన్నాడు.

''మాటలెప్పుడూ విసుగు పుట్టవండీ! భాషలోని ప్రతి అక్షరంలోనూ ఒక విధమైన నాదం ఉంటుంది. లయ ఉంటుంది. మన మనస్సు లగ్నం కాకపోతే విసుగువస్తుంది. కానీ, మాటల వల్ల కాదు'' అంది నీరజ.

కొత్త సంగతి వింటున్నట్లు, ఆశ్చర్యంగా చూశాడు చలపతి!

''మీవూరి విశేషాలు చెప్పండి.'' నీరజ అడిగింది.

ఆ విశేషాల్తో పాటు తనకూ, రాజారావుకు ఉన్న స్నేహ బంధాన్ని వివరించాడు చలపతి.

మాటల్లోనే బాగా చీకటి పడింది. సముద్రపు హోరు కూడా ఎక్కువయింది.

''ఇక వెడదాం చాలా ప్రొద్దుపోయింది. చలిగా కూడా ఉంది. ఆరోగ్యానికి మంచిది కాదు'' అన్నాడు రాజారావు లేస్తూ.

''ఈ మధ్య రాజారావుకి ఆరోగ్య సూత్రాలు బాగా తెలుస్తున్నాయి'' నవ్వుతూ లేచింది నీరజ.

ముగ్గురూ బీచి వెంట నడుచుకుంటూ ఇంటికి వచ్చారు.

"సారధికి నేను భోజనం తీసికెడతాను" అన్నాడు రాజారావు.

"ముందు మనం భోజనం చేద్దాం" అని వంటామెను పిలిచి ముగ్గురకూ భోజనం వడ్డించమంది నీరజ.

మరో అయిదు నిముషాలకు ముగ్గురూ డైనింగ్ టేబిల్ ముందు కూర్చున్నారు. మధ్యలో నీరజ అంది హఠాత్తుగా-

"డాబామీద కూర్చుని, పైనచుక్కల్ని చూస్తూ భోజనం చేస్తే చాలా బాగుంటుంది కదూ!"

చలపతి క్షణ కాలం ఆమె వేపు ఆశ్చర్యంగా చూశాడు. భోజనాలయ్యాక. "మీ వంటామెడ చాలా బాగా వంట చేస్తుందండీ : ఇంత కమ్మటి భోజనం ఇంతవరకూ తినలేదు". చలపతి మెచ్చుకున్నాడు.

"అలాగా!" అంది నీరజ నిర్లిప్తగా.

అదేమిటీ? అలా తేలిగ్గా అనేశారు: మీకు నచ్చలేదా?"

"ఎందుకు నచ్చలేదు. నిజం చెప్పాలంటే నా కేదీ అరుచిగా ఉండదు: ఆగిపోయిన గడియారంకూడా రోజుకు రెండు సార్లు కరెక్టు టైము చూపిస్తుంది. అలాగే చెడిపోయిన పదార్ధంలోకూడా ఏదో రుచి ఉంటుంది. మనసు బాగుంటే అన్నీ బాగుటాయి" అంది నీరజ.

నీరజ మాటలకు మరోసారి ఆశ్చర్యపోతూ టేబిల్ ముందు నుండి లేచాడు చలపతి.

రాజారావు సారధి దగ్గరకు వెళ్ళాడు. నీరజ మేడమీదికి వెళ్ళింది. చలపతి తన గదికి వెళ్ళాడు మంచంమీద పడుకుని రాజారావు గురించి ఆలోచించసాగాడు.

రాజారావు అతి బీదవాడు. అతడికి తల్లిదండ్రులు లేరు. చదువంతా స్కాలర్ షిప్పుమీదే నెట్టుకొచ్చాడు. అతడి రూపంకూడా అతి సామాన్యం అటువంటి వ్యక్తిని నీరజ ప్రేమిస్తూందా? ఇది నిజమేనా! లేక రాజారావు భ్రమ పడుతున్నాడా ?నీరజకీ, రాజావుకీ ఎప్పటినుండీ పరిచయం? ఇవన్నీ జవాబులు తెలుసుకోవాల్సిన ప్రశ్నలు.

కానీ ఒక్కటిమాత్రం స్పష్టంగా తెలుస్తూంది. నీరజ జీవితంలో ఏదో అపశ్రుతి అపధం ఉంది : ఆమెది 'అలసిన సౌందర్య' కాదు "అవగతం కాని సౌందర్యం' అనుకుంటూ కళ్ళు మూసుకున్నాడు చలపతి.

* * *

మరునాడు ఉదయం రాజారావు లేపుతూంటే మెలుకువ వచ్చింది చలపతికి.

"రాత్రి నేను వచ్చేసరికి నిద్ర పోయావ్" అన్నాడు రాజారావు.

"అవును. నిద్ర వచ్చేసింది. ఆపుకోలేకపోయాను" అంటూ లేచి బాత్‌రూమ్ కెళ్ళి అరగంటలో స్నానం చేసి తిరిగొచ్చాడు చలపతి టిఫిను కాఫీ పైకొచ్చింది.

"నీరజ లేదా?" చలపతి అడిగాడు

"హాస్పిటల్‌కి వెళ్ళింది."

"నేను సాయంత్రం ట్రెయిన్‌లో వెళ్ళిపోతానురా రేపు ఆఫీసుకు వెళ్ళాలి" కాఫీ తాగుతూ అన్నాడు చలపతి.

"అప్పుడేనా?" దిగులుగా అన్నాడు రాజారావు. ఏపు లేదు."

రాజారావు మాట్లాడలేదు.

"రాజా! నిన్నొక ప్రశ్న వేయాలనుకుంటున్నాను అడగనా?"

"ఏమిటిది?"

"నీరజా. సారథి వివాహం పెద్దలు కుదిర్చిందేనా?"

"కాదు. యూనివర్శిటీలో వాళ్ళకి పరిచయం కలిగింది. నీరజ తండ్రి సామాన్య గుమాస్తా, సారథి వెళ్ళి నీరజ తండ్రితో మాట్లాడాడు. అందం, చదువు, ఐశ్వర్యం ఉన్న సారథి కోరి పెళ్ళి చేసుకుంటానంటే ఏ తండ్రి కాదంటాడు. సారథి పెద్దలుకూడా కొడుకు ప్రేమని అంగీకరించారు. వాళ్ళిద్దరి చదువయి పోగానే వివాహం జరిగిది."

"అలాగా" అని "ఇక నీ విషయం చెప్పు" అనడిగాడు చలపతి

"అదే చెప్పబోతున్నా సారథి నేను స్నేహితులమైనా, ఒకే వూళ్ళో ఉన్నాతుచు అతనింటికి వచ్చేవాడిని కాదు అప్పుడప్పుడు అతడి కంపెనీలోనే కలుసుకునే వాడిని. పది రోజుల క్రితం సారథికి హార్ట్ ఎటాక్ వచ్చిందని తెలిసి హాస్పిటల్‌కి పరిగెట్టాను. రజ అప్పుడు అక్కడే ఉంది ఆ రోజల్లా సారథికి స్పృహలేదు. మరునాడుదయం. డాక్టర్ ఇక అతడి ప్రాణాలకు భయం లేదని చెప్పాక నా మనస్సు కుదుట పడింది. నేనూ నీజా ఇంటి ముఖం పట్టాం. సారథి ఇంటికి తిరిగి వచ్చేవరకూ వాళ్ళింట్లోనే ఉండుని కోరింది నీరజ. కాదనలేక పోయాను. నాలుగు రోజులు మామూలుగా గడిచాయి. అవసరానికిమించి మాట్లాడేవాడిని కాను. ఒక రోజు సాయంత్రం హాస్పిటల్ నడి వస్తున్నప్పుడు నీరజ కారుని సినిమాహాలు వేపు మళ్ళించింది.

నీరజే టిక్కెట్లు తీసుకుంది. నేను మౌనంగా ఆమెని అనుసరించాను. ది పాత తెలుగు సినిమా. ఆసక్తిగా చూస్తున్నాను. ఇంతలో హఠాత్తుగా జివ్వుమన్నాం. చటుక్కున చేతిని లాక్కున్నాను. మరి కొంత సేపటికి మళ్ళీ ఆమె చేతి వేళ్ళు నా చే

వెళ్ళికాయి. నాకా చేతి స్పర్శ వింత అనుభూతిని కలిగించింది. ఈ సారి నేను చేతిని వెనక్కు తీసుకో లేకపోయాను.''

అగాడు రాజారావు.

రాజారావు మళ్ళీ ఎదో అనబోతుండగా "సార్! డ్రైవర్ కారు తీసుకొచ్చాడు" అటూ నౌకరు వచ్చి చెప్పాడు.

''చలపతీ! మనం హాస్పిటల్‌కి వెళదామా!'' అంటూ లేచాడు రాజారావు. ఇద్దరూ కారులో కూర్చున్నారు.

"ఆ తర్వాత.'' రాజారావు మొదలెట్టాడు. చలపతి. డ్రైవర్ వింటాడంటూ సైగ చేశాడు.

రాజారావు నవ్వు "ఫరవాలేదు. అతడికి తెలుగు సరిగ్గా రాదులే'' అన్నాడు.

''అయితే కానీ!''

''ఆ తరవాత నీరజ నాతో చనువుగా ఉండాలని ప్రయత్నించేది కానీ నేను తప్పించుకు తిరిగేవాడిని. ఒక రోజు రాత్రి నేను నిద్ర పట్టక బాల్కనీలో కూర్చుండగా నీరజ వచ్చినా దగ్గర నిలబడింది.

"నాకూ నిద్ర పట్టడం లేదు.'' అంది నేను ఉలిక్కిపడి చూశాను. తెల్లని జరీ చీర. నల్ల సిల్కు జాకెట్టు. జడలో సన్నజాజులు. వెన్నెల కన్నెలా ఉంది. నా ఎదురుగా కూర్చుంది.

"ఏమిటి రాజా. ఆలోచిస్తున్నావ్?"

"ఏం లేదు".

''తప్పించుకు తిరుగుతున్నా ఇలా వెంటబడుతూందేమిటా అని ఆలోచిస్తున్నావా'' నవ్వుతూ అడిగింది.

నేను తడబడి పోతూ "అబ్బే అదేం కాదు. సారథి జబ్బు గురించి" అన్నాను.

"సారిధి కొచ్చిన వ్యాధి ప్రమాదకరమైనదే, కానీ డాక్టరు ఫరవాలేదన్నారుగా, అయినా రోగులతో పాటు మనం బాధ పడుతూకూర్చుంటే ప్రయోజనమేవుంది?"

'ఎలాగైనా నీకు ధైర్యం ఎక్కువ, నీరజా!' అన్నాను.

"ధైర్యం కాదు. జీవితపు విలువలు తెలుసు!'

ఆమె మాటలు అర్థం కాక పోయినా నేనేం ప్రశ్నించలేదు.

సముద్రం మీద నుండి వస్తున్న గాలికి ఆమె పైట కొంగు ఎగిరెగిరి పడుతోంది మాటిమాటికీ జారుతోంది. ఆమె ధరించిన నల్ల సిల్కు జాకెట్టు ఎదురుగా ఉన్న నల్లని సంద్రంలా నన్ను భయపెడ్తోంది. హఠాత్తుగా ఆమె లేచి నిలబడింది గాలికి కొంగు ఎగిరి నా ముఖాన్ని తాకింది. ఆమె దాన్ని అందుకొనే మిషతో నా దగ్గరి కొచ్చి రెండు చేతులూ నా భుజం మీద వేసింది.

ఆమె జడలోని సన్నజాజులు, ఒంటికి రాస్తున్న ఇంటిమేట్ పరిమళం కలిసి నన్ను ఉక్కిరిబిక్కిరి చేశాయి. నా కతి సమీపంగా ఉంది నీరజ. నా మనస్సు కల్లోల సాగరం అయింది. అప్రయత్నంగా ఆమె నడుం మీద రెండు చేతులూ ఉంచి దగ్గరకు లాక్కున్నాను. క్షణం తర్వాత ఆమె నన్ను విడిపించుకుని లోపలకు పరిగెట్టింది.''

రాజారావు ఆగాడు. క్షణం తర్వాత -

''చలపతీ! ఆ తర్వాత నీరజ నాతో మరింత చనువుగా ప్రవర్తించ సాగింది. ఇతరుల ముందు ముఖ్యంగా సారధి ఎదుట కూడా నన్ను వేళాకోళం పట్టించసాగింది.

'చూశారా, మీ రాజారావు ఏవంటున్నాడో- మీకు జబ్బుగా ఉందిట. అందుకని నేనిక సినిమాకిగానీ, బీచికిగానీ వెళ్ళకూడదట.' అందొక రోజు నవ్వుతూ.

'ఇంకా నయం. భోజనం చెయ్యొద్దనలేదు.'' సారధి నవ్వాడు. ఆ నవ్వు వెనకాల లీలగా విషాదం ఉందేమో నన్పించింది.

ఒక రోజు బజారు కెడుతోంటే నీరజ పండు సంపెంగలు తెమ్మంది. నేను తీసుకురాలేదు. 'పువ్వులేవీ?' అనడిగింది.

'మర్చిపోయాను.'

'నాకు తెలుసు. అందుకే వేరే తెప్పించుకున్నాను' అంటూ కర్చీఫ్‌లో కట్టిన పూలు చూపించింది. ఆ తర్వాత ఇద్దరం హాస్పిటల్‌కి వెళ్ళాం.

'అబ్బ ఎక్కడ సంపెంగ వాసన' అన్నాడు సారధి.

'నేను తెప్పించుకున్నాను. రాజారావుని తెమ్మంటే మర్చిపోయా నన్నాడు. బహుశ నేను పూలు పెట్టుకోడం అతనికి ఇష్టం లేనట్లుంది.

'ఎందుకని?'సారధి అడిగాడు.

'భర్త జబ్బులో ఉంటే భార్యకిక ఏ సరదాలు ఉండకూడదట. ఉపన్యాసాలు విప్లవాత్మకంగా ఉంటాయి. కానీ, ఆచరణలో అన్నీ పాత భావాలే' అంది.

'రాజారావు ఈమధ్య మారాడులే' అన్నాడు సారధి. అలా ఎందు కన్నాడో నా కర్థం కాలేదు. హాస్పిటల్ నుండి వస్తున్నప్పుడు నీరజ కర్చీఫ్‌లో నుండి పూలు తీసి పెట్టుకుంది!

'అలా ఉన్నావే?' అనడిగింది నన్ను చూస్తూ.

'నీరజా! నా కిదేం నచ్చలేదు.'

''ఏదీ! నేను పూలు పెట్టుకోవడమా!''

'కాదు. సారధి అలా మంచంలో ఉంటే మనం ఇలా ఉండడం...' అన్నాను.

'అయితే సారధికి జబ్బుతగ్గాక మనం ఇలా.. ఉండొచ్చా......' బిగ్గరగా నవ్వింది.

'రాజారావ్! అమాయకంగా ఉండటం మంచిదే! కానీ అన్ని విషయాల్లోనూ అది రాణించదు' అంది నా భుజం మీద చెయ్యివేసి! కానీ నా కా మాటలు అర్థంకాలేదు.

'నీరజా! నువ్వు సారథిని ఇష్టపడే చేసుకున్నావ్ కదూ?'

'ఇప్పుడెందుకా సందేహం వచ్చింది.'

'మరేం లేదులే...'

'రాజారావ్! నాకు తెలుసు. క్షణం ఆగి అంది. ''రాజారావ్! పర్వత శిఖరం మీద ఏదో ఏదో గొప్పనిధి ఉందని ఆశపడి. ఎన్నో ప్రయాసల కోర్చి ఎత్తైన ఆ శిఖరాన్ని అధిరోహించినప్పుడు తీరా అక్కడికెళ్ళాక అది నిధికాదని బూడిద కుప్పని తెలిస్తే? అగాధ సాగరంలో ముత్యాల చిప్పలకోసం శ్రమతో వెతికినప్పుడు నత్తగుల్లలు చేతికి తగిల్తే... ఎలా ఉంటుంది ఆ మనస్థితి? అంతేకాదు. ఆ పర్వత శిఖరం నుండి, ఆ అగాధ సాగరం నుండి తిరిగి బయటికొచ్చే అవకాశం లేనపుడు ఏదైనా గడ్డిపోచంత ఆధారం దొరుకుతుందేమోనని వెదకటం పొరపాటా?' అంది నీరజ ఉద్వేగంగా!

'నీరజా ! నాకేం అర్థం కావడం లేదు.' అయోమయంగా అన్నాను.

నీరజ శుష్కహాసం చేసింది.

'స్త్రీ హృదయాన్ని ఏ పురుషుడు అర్థం చేసుకోలేడు. అందుకే సాహిత్యంలో అన్నీ విషాదాంత కావ్యాలు.'

కారు ఇంటిని సమీపిస్తోంది.

'రాజా! ఇంకెన్నాళ్ళు ఈ ముసుగులో ఆటలు?' అంది నా భుజం మీద చెయ్యివేసి.

నేను కంగారుపడి – 'ఏమిటిది, నీరజా!' అన్నాను.

''రాజారావ్! మనసులో చెలరేగే భావాలన్నీ పైకి చెప్పడానికి కుదరక పోవచ్చు. భాష చాలక పోవచ్చు. అందుకే మనసుకు కళ్ళతోపాటు చెవులు కూడా ఉండాలి, తెలిసిందా?'' అంది.

నేను మాట్లాడలేదు.

* * *

రాజారావు చెప్పడం అపాడు. కారు హాస్పిటల్ చేరింది. ఇద్దరూ లోపలి కెళ్ళారు. సారథి బెడ్‌మీద దిండు కానుకొని కూర్చున్నాడు. నీరజ అతని ప్రక్కనే కూర్చుని దానిమ్మగింజలు వలిచి పెడ్తోంది.

చలపతి కా దృశ్యం మనోహరంగా కన్పించింది. నీరజ భర్తకి సేవచెయ్యడం కూడా ఒక కళగా అభ్యసిస్తోంది దనిపించింది.

చలపతి ఆమె వేపు చూశాడు.

గోధుమరంగు బిన్నీ సిల్కుచీర, పైన నల్ల చుక్కలున్న తెల్లసిల్కు జాకెట్టు జుట్టుపైకి దువ్వి సిగ చుట్టింది. ఒక ప్రక్కగా సగం విచ్చిన గులాబీ గుత్తి, చేతికి నల్లరాళ్ళ గాజులు. నుదుటి మీద ఎర్రని కుంకుమ.

ఈమెకీ రంగులు ఎక్కడ దొరుకుతున్నాయో నన్పించిందతనికి. అందంగా అలంకరించుకోవడం కూడా ఒక కళ అయితే ఆ కళలో ఆరితేరిన వ్యక్తి నీరజ.

"రండి. అక్కడే ఆగిపోయారే?" నీరజ ఆహ్వానించింది. ఇద్దరూ లోపలి కెళ్ళారు. ఆ రోజు సారధి చాలా తేటగా కన్పించాడు.

"సారధిగారూ! ఎలా ఉందండీ?" చలపతి అడిగాడు.

"బాగానే ఉంది. నన్ను చూడ్డానికి చాలా శ్రమపడి వచ్చారు. చాలా థాంక్స్" అన్నాడు సారధి.

"అలా అనకండి. రాజారావుకి మీరుమంచి మిత్రులు. నాకూ స్నేహితులే!"

సారధి చలపతిని గురించిన విషయాలు అడిగాడు.

"చలపతి సాయంత్రం వెడతాడుట." రాజారావు అన్నాడు.

"ఈ మధ్య రాజారావు కూడా ఇలాగే బెదిరిస్తున్నాడు. బహుశా వాళ్ళకి మనిల్లు బంధిఖానాలా ఉందేమో?" నీరజ నవ్వింది.

చలపతి నీరజ వేపు చూశాడు.

ఎదురుగా ఉన్న గాజు కిటికీ నుండి ఎండ కిరణాలు ఆమె నుదుటి మీద పడి కనురెప్పల నీడల్ని తాకి, తీగలుగా బుగ్గల మీదికి జారుతున్న దృశ్యం. కిరణం ఆమెగా అంతమైనట్లు భావం. ఈ అనుభూతిని తనెప్పుడూ మర్చిపోలేనని అనుకున్నాడు చలపతి.

"నిజమేనా, రాజారావ్!" సారధి అడిగాడు.

"అబ్బే ! అదికాదు... సారధి! ఉద్యోగంలో చేరాలి కదా!" అన్నాడు రాజారావు నసుగుతూ.

"ఇక్కడనుండి వెళ్ళొచ్చుగా?" సారధి అన్నాడు. రాజారావు మాట్లాడలేదు.

"చలపతిగారూ! మీరు వెడుతున్నారా?" సారధి అడిగాడు.

"అవునండీ! నాకిక సెలవు లేదు."

"మళ్ళీ ఎప్పుడైనా రండి."

"తప్పకుండా వస్తాను." మాటిచ్చాడు చలపతి. పావుగంట తర్వాత, సారధి పడుకున్నాక ముగ్గురూ కారులో ఇంటి కొచ్చారు.

ఆ సాయంత్రం చలపతిని రైలెక్కించడానికి స్టేషన్ కొచ్చాడు రాజారావు.

"చలపతీ ! నువ్వెళ్ళిపోతుంటే నాకు చాలా అధైర్యంగా ఉందిరా"అన్నాడు రాజారావు.

చలపతి అతడి వేపు చూశాడు. రాజారావు ముఖం పాలిపోయి ఉంది.

"రాజారావ్! నే నొక విషయం అడగనా?"

"ఏమిటది?"

"నీరజ నిన్ను ప్రేమిస్తున్నట్లు తెలిసింది. నువ్వామెను ప్రేమిస్తున్నావా?"

"ఏమో ! చెప్పలేను" అన్నాడు ముభావంగా.

చలపతేమీ వ్యాఖ్యానం చెయ్యలేదు. రాజారావు వ్యక్తిగతంగా చాలా మొహమాటం మనిషి. దానికి కొంత అతని దారిద్ర్యం కారణం కావచ్చు. బీదవానికి నైతిక చింతన ఉండదంటారు కానీ, రాజారావు చదువుకోవడం వల్ల ఒక మెట్టు పైకి ఎక్కాడు. మధ్యతరగతి జాబితాలోకి వచ్చాడు. భాగ్యవంతులకు ఎటువంటి నైతిక సూత్రాలూ వర్తించవు. దాని క్కారణం వాళ్ళకు డబ్బు ఉండటమే. దీనికి ఉదాహరణ నీరజ. ఆ డబ్బు లేకపోవడం వల్లనే రాజారావు తాను నీరజని ప్రేమిస్తున్నా, ప్రేమను ప్రకటించకుండా ఉన్నాడు.

"ఏమిటి నీ ఆలోచనలు?" రాజారావు అడిగాడు.

"ఏంలేదు. సారధికి నయమయ్యాక మీ పరిస్థితి ఎలా ఉంటుందో?" అన్నాడు చలపతి.

"నీరజ అతడి వెంటే వెడుతుంది" అన్నాడు రాజారావు.

"నీరజ ప్రేమ అంత చంచలమా?"

"అసలు స్త్రీ ప్రేమే చంచలం." పెదవి విరిచాడు రాజారావు.

"కాదు, రాజారావ్! మొక్క బాగా పెరగడానికి వెలుతురూ, ఈ నీరూ ఎలా అవసరమో, ప్రేమ వృద్ధి పొందడానికి అనుకూల వాతావరణం, సానుకూలమైన వ్యక్తి అవసరం. అవి ఉన్నప్పుడే స్త్రీలో స్పందన కలుగుతుంది. పైన చెప్పిన కారణాలు శాశ్వతమైతే ప్రేమ శాశ్వతం" అన్నాడు చలపతి.

ఆ మాటలు రాజారావుకు నచ్చాయో, లేదో కానీ ఏం సమాధానం చెప్పలేదు.

ఇంతలో రైలు వచ్చింది.

చలపతి రాజారావు దగ్గర సెలవు తీసుకుని రైలెక్కాడు.

* * *

మూడు నెలల తర్వాత చలపతి ఆఫీసు పనిమీద మళ్ళీ వైజాగ్ వెళ్ళాల్సి వచ్చింది. వాల్తేరు స్టేషన్‌లో రైలు దిగగానే అతడికి మొదటగా గుర్తు వచ్చిన వ్యక్తి నీరజ. ఆమెని తలుచుకోగానే మనస్సులో ఒక మధుర భావం కదలాడింది.

వెన్నెలా, పువ్వులూ, సువాసన. లేడి చూపులు, సెలయేటి పరుగులు, వీణా స్వరం - ఇవన్నీ కలిస్తే స్త్రీ అవుతుందిట.

ఇవే కాదు-నీరజలో ప్రపంచాన్ని కదిలించే ప్రచండ శక్తులు, సముద్రపు లోతుల్ని కదిపేసే ఇంద్రియాల తీవ్రతా ఉన్నాయి.

ఆమె సాధారణ వ్యక్తి కాదు!

అపురూపమైన అనుభవాల సమ్మేళనం:

"ఆమె ఎలా ఉందో!" అనుకుంటూ బీచ్ రోడ్‌లో ఉన్న సారధి ఇంటికి వెళ్ళాడు చలపతి!

అలవాటుపడిన ప్రదేశం కాబట్టి స్వేచ్ఛగా గేటుతీసుకుని లోపలకు వెళ్ళాడు. క్రింది హాల్‌లో సూట్‌కేస్‌లు, హోల్డాలు కన్పించాయి "ఎక్కడికో ప్రయాణమైనట్లున్నారు" అనుకుంటుండగా నౌకరు కన్పించాడు 'అయ్యగారు మేడ మీద ఉన్నారండీ" అన్నాడు.

చలపతి మెట్లెక్కి పైకి వెళ్ళాడు.

గదిలో నీరజ సారధి చెరో సోఫాలో కూర్చుని ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

సారధి తలెత్తి అతడిని చూసి "రండి, రండి" అంటూ సంభ్రమంగా ఆహ్వానించాడు.

చలపతి లోపలి కెళ్ళి సారధి ప్రక్కన కూర్చున్నాడు

"ఎలా ఉంది మీ ఆరోగ్యం?" చలపతి అడిగాడు.

"ఎలా కనిపిస్తున్నాను!" సారధి నవ్వుతూ ఎదురు ప్రశ్న వేశాడు.

"బాగానే ఉన్నట్లుగా కనిపిస్తున్నారు."

"కరెక్ట్. నాకు పూర్తి ఆరోగ్యం వచ్చింది. నీరజ.." అంటూ ఆగిపోయాడు. చలపతి వేపు తిరిగి- "మా గృహిణిగారు అలక సాగిస్తున్నారు" అన్నాడు సారధి నవ్వుతూ.

చలపతి నీరజ వేపు చూశాడు. ఆమె కుడి బుగ్గమీద ఎర్రటి గాటు. బహుశ గులాబి ముల్లు గుచ్చుకుందేమో? ఆమె మాత్రం ముళ్ళు లేని గులాబీలా ఉంది.

"కారణం తెలుసుకోవచ్చా?" చలపతి అడిగాడు.

"మరేం లేదు. మేము వూటీకి ప్రయాణం పెట్టుకున్నాం. ఈ రాత్రి ఫ్లైట్‌కి టిక్కెట్లు కూడా రిజర్వ్ అయిపోయాయి. కానీ హఠాత్తుగా నిన్న రాజారావుకి యాక్సిడెంట్

అయ్యింది. నిన్నల్లా స్పృహలో లేడు. ఇటువంటి పరిస్థితిలో అతడిని వదిలి ఎలా వెళ్ళడం? మీరే చెప్పండి." సారథి అన్నాడు.

"ఇప్పుడతనికి బాగానే ఉందిగా." నీరజ అంది.

"అయితే మాత్రం ఎలా వెళతాం?"

"మీకు ఎప్పుడూ ఏదో ఒక సాకు కనిపిస్తూ ఉంటుంది."

"నువ్వేమైనా అను. నేను మాత్రం రాను. నేను హాస్పిటల్లో ఉండగా ఎంతో సేవ చేశాడు. అతడికి నయమవ్వాలి ముందు. అయినా రాజారావు మంచంలో ఉంటే వూటీ వెళ్ళాలనడానికి నీ కెలా మనసొప్పింది. ఛ. ఛ. నీకు కావలిసింది మనుషులు కాదు-సుఖాలు. నీ దంతా ఒట్టి స్వార్థం." విసుక్కుంటూ సారథి బయటికి వెళ్ళిపోయాడు.

నీరజ ముఖం ఎర్రబడింది.

"చూశారా- ఎంత మాట అన్నారో? నాది స్వార్థమా. పెళ్ళయి మూడేళ్ళయినా ఒక్క వూరు వెళ్ళలేదు. ఒక చిన్న కోరికకూడా తీరలేదు. ఎప్పుడూ ఏదో కారణం చెబుతారు" అంది రోషంగా.

ఆమె కళ్ళ చివర నీటిచుక్క.

ఘనీభవించిన విషాదానికి చిహ్నం!

మోనాలిసా పెదవులపై విచారమా! చలపతి భరించ లేకపోయాడు.

కిందికి వచ్చి ఆటోలో హాస్పిటల్‌కు వెళ్ళాడు. రాజారావు రూము తేలిగ్గానే తెలుసుకో గలిగాడు.

చలపతి వెళ్ళేసరికి రాజారావు స్పృహలోనే ఉన్నాడు.

"చలపతీ! సమయానికి వచ్చావ్?" ఆనందంగా అన్నాడు.

"ఎలా జరిగిందిరా యాక్సిడెంట్.

"ఇప్పుడా పీడకలని గుర్తుకు చెయ్యకురా !" బాధగా అన్నాడు రాజారావు.

"ఇప్పుడు కులాసాగా ఉందా?"

"ఆ!"

చలపతికి నీరజ గురించి అడగాలని ఉంది. రాజారావుకూడా ఏదో చెప్పాలనుకుంటున్నాడు. కానీ ఎవ్వరూ పెదవి విప్పలేదు. వాళ్ళ సంభాషణల్లోకి నీరజ పేరు రాకుండా జాగ్రత్త పడ్డారు.

ఆ రాత్రికి తన పని చూసుకుని చలపతి మరునాడు మెయిలెక్కాడు.

వెళ్ళే ముందు రాజారావుని మళ్ళీ కలిసి అతడి ఆరోగ్యం గరించి ఉత్తరం వ్రాయమని చెప్పాడు.

రైల్లో కూర్చున్నా చలపతికి విషాదంలో ముడుచుకున్న నీరజ ముఖమే జ్ఞాపకం వస్తూంది.

అమె ఎప్పుడూ నవ్వుతూ ఉంటేనే బాగుంటుంది, విషాదం ఆమెకు విజాతీయమైన వస్తువు అనిపించింది చలపతికి.

* * *

దాదాపు నెల తరవాత రాజారావు ఉత్తరం వ్రాశాడు.

"చలపతీ!

నేను బాగానే ఉన్నాను. నీకో విషయం చెప్పబోతున్నా. నీరజ రెండ్రోజుల క్రితం సారథిని వదిలి వెళ్ళిపోయింది. ఎక్కడికో తెలీదు. వెళ్ళేముందు తన కోసం వెతక వద్దని సారథికి ఒక ఉత్తరం రాసిపెట్టింది.

నీకు ఆశ్చర్యంగా ఉంది కదూ-అంత డబ్బుని, సారథినీ వదిలి ఏ ఆడదైనా వెళ్ళిపోతుందా? బహుశ నీరజకి పిచ్చి పట్టిందేమో?

రాజారావు."

ఉత్తరం మడిచాడు చలపతి.

అతని కా విషయం ఏ మాత్రం ఆశ్చర్యం కలిగించలేదు.

ఊహించిందే జరిగినట్లు ఉంది.

"బహుశ నీరజకి పిచ్చి పట్టిందేమో!" రాజరావు వ్రాసిన ఆ మాటలకు నవ్వుకున్నాడు చలపతి

నీరజ పిచ్చిది కాదు.

విచిత్ర శక్తి.

ఏవో అపురూపమైన అనుభవాల్ని వెతుక్కుంటూ వెళ్ళి ఉంటుంది.

నీరజ వినీలాకాశంలో ఎగిరే విహంగం లాంటిది. ఆమె ఉండాలిసింది ఆ పాలరాతి మేడలో కాదు. మనుషులతో కళకళలాడే రామకృష్ణా బీచిలో.

ఆమెకు కావలిసింది డబ్బు కాదు. ప్రేమ, దయ, సానుభూతి. గుప్పెడు అభిమానం. తనను గురించి శ్రద్ధ తీసుకునే వారున్నారన్న ధీమా.

ఆమెకు కావలిసిందేమిటో రాజారావు, సారథీ కూడా గ్రహించ లేకపోయారు.

సారథి ఆమెను స్వార్థపరురాలన్నాడు.

పాపం నీరజ.

ఏమయిందో? ఎక్కడుందో? అనుకున్నాడు చలపతి బాధగా.

ఆ తరువాత ఎప్పుడైనా చక్కని సంగీతం విన్నా, అందమైన అమ్మాయిని చూసినా నీరజే జ్ఞాపకం వచ్చేది అతనికి. నీరజ జ్ఞాపకం వచ్చిన ప్రతి క్షణం కళ్ళు రెండూ నీటితో తడిసి పోయేవి చలపతికి!